# గళ్ల రవిక

-అడబాల రాజ్యలక్ష్మి

ఆ రోజు చాలా వర్షం పడింది. చలి గజగజలాడించేస్తోంది. అయినా అమ్మగారింటికి వెళ్లి వాళ్ల పని చేసిపెట్టడం లక్ష్మికి తప్పలేదు. అయినా ఆమెకీ రోజు పని చేసినా విసుగు లేదు. కారణం- తనకు అమ్మగారు దీపావళికి కొత్త లంగా జాకెట్టు కుట్టించి ఇస్తానంది. అది తనకెంతో సంతోషంగా వుంది. కావటానికి లక్ష్మి వాళ్లమ్మకు ఒకే కూతురు. అయితే, తల్లికి వెనకా ముందూ ఎవరూ లేరు. తనే కాయకష్టం చేసుకుని, స్వతంత్రంగా బతుకుతూ కూతుర్ని చదివించుకుంటోంది. లక్ష్మి ఇప్పుడు ఎనిమిదో క్లాసులో వుంది. ఎలాగో టెన్త్ వరకూ నెట్టుకొస్తే పిల్లను టీచర్‌గా వేయించి, తనకంటే మంచిగా బ్రతికేలా చూడొచ్చనీ, అలాగే తనూ ఈ పాచిపనులు మానేసి సుఖంగా ఉండొచ్చని లక్ష్మి తల్లి దుర్గమ్మ ఆశ. కూతుర్ని ఆ మాత్రం చదివించటం భారమే. అయినా ఎక్కడ పని వుందంటే అక్కడికల్లా వెళ్లి ఆ పని కుదుర్చుకుంటుంది. తనూ మరీ చేయలేకపోతే కూతుర్ని కూడా శ్రమపెట్టి డబ్బులు సంపాదిస్తుంది.

✦ ✦ ✦

దుర్గమ్మకెప్పుడూ సుఖసంతోషాలూ, భోగభాగ్యాలూ తెలీవు. అది పుట్టటమే పనిమనిషి కూతురిగా పుట్టింది. వాళ్లమ్మకు నలుగురు కూతుళ్లుండే వాళ్లు. అయినా వాళ్లెప్పుడూ కడుపునిండా అన్నం తిని ఎరుగరు. అయ్య లేడు. అమ్మ రెక్కలు విరుచుకుంటేనే వాళ్లకు తిండి. ఆ ఇంట్లో నుంచి వచ్చిన దుర్గమ్మ- కూతురు చదువు గురించి ఆలోచిస్తుందంటే గొప్పకిందే లెక్క.

ఆ నలుగురు పిల్లల్లో మూడోదయిన తనకు పెళ్లి కూడా చెయ్యలేకపోయింది తన తల్లి. టీకొట్టు కుర్రాడితో జతకట్టిన దుర్గమ్మ, వాణ్ణి నమ్మి తల్లిని వదలి వచ్చేసింది. వాడ్ని కట్టుకున్న పుణ్యమే ఈ లక్ష్మి. తరువాత దుర్గమ్మను విడిచిపెట్టి వాడెటో పోయాడు. అయినా దుర్గమ్మ పుట్టి పెరిగిన వాతావరణం, అక్కడి ఆడామగా అవసరాలు తీర్చుకోవడం, తరువాత విడిపోవడం. అంతేగానీ ఈ పాతివ్రత్యం గురించి పట్టింపులూ ఆమెకు తెలీవు. ఏదో కుర్రాడు సరదా పడ్డాడు. వాడి అవసరం తను తీర్చింది. వాడన్ని రోజులూ తనను పోషించాడు. అంతే ఆమెకు తెలుసు. ఇప్పుడు వాడు లేడు. తన తిప్పలు తను పడాలి.

అప్పట్నుంచీ ఆమె నాలుగిళ్లల్లో పని చేసుకుని, లక్ష్మిని పెంచుకుంటూ గౌరవంగా బ్రతుకుతోంది. తన ఈ చీకటి తప్పును లక్ష్మికి తెలియనివ్వలేదు. మీ అయ్య చచ్చిపోయాడని మటుకు ఆ పిల్లకు చెప్పింది. తల్లి అంత చాకిరీ చేస్తూ తననింట్లో సుఖంగా ఉంచటం లక్ష్మికి మనసొప్పక స్కూలు నుంచి వచ్చిన దగ్గర నుంచీ, స్కూలుకు వెళ్లేవరకూ తల్లికి సహాయంగా వుంటోంది.

అలాగే ఆ రోజు అమ్మ గారింట్లో పనికి వెళ్లింది. అయితే ఆ రోజు అమ్మగారు వేసుకున్న జాకెట్టు లక్ష్మిని చూపు తిప్పుకోనివ్వలేదు. ఆ గళ్లల్లో వున్న సొగసేమిటో అవి ఎలా వచ్చాయో, ఆ గుడ్డ అమ్మగారు ఎక్కడ కొనుక్కున్నారో తెలుసుకోవాలనుంది. అడగటానికి మొహమాటంగా వుంది. ఇలాంటి జాకెట్టు తను పోయిన్నెల చూసిన సినిమాలో హీరోయిన్ వేసుకుంది. కానీ అది తనకెలా వస్తుందని ఊరుకుంది. ఇప్పుడదే అమ్మగారి వ ంటిమీద చూసేసరికి కాసిని డబ్బులుంటే తనూ అటువంటివి కుట్టించుకోవచ్చుని సరిపెట్టుకుంది. అమ్మగారినడిగినా కుట్టించి యిస్తారేమో, అడగడానికి భయంగా వుంది.

"ఏమిటే! నేను పిలిస్తే పలకవూ!" అని అమ్మగారు కసురుకునేసరికి, "ఆఁ ఆఁ ఏం లేదమ్మగారూ! మరీ, మరీ... ఆ జాకెట్టు



మీరెప్పుడు కొనుక్కున్నారోననీ...”

“ఓసీ నీ! ఈ రవికె నీకంత నచ్చిందేమిటే. మన సాయిబు కొట్లోనే కొన్నానే.”

✦ ✦ ✦

ఆ పిల్ల దాని గురించే ఆలోచిస్తూ రోజులు గడుపుతోంది. తనకెక్కడ ఒక రూపాయి మిగిలినా దాని గురించే దాచిపెట్టేది. ఆ డబ్బులు తీసి రోజూ లెక్కపెట్టడం. ఆ డబ్బులు మాత్రం తల్లిని అడగలేకపోయింది. అమ్మను బాధపెట్టడమే గానీ, అన్ని డబ్బులు అమ్మ దగ్గరుండవని ఆమెకు తెలుసు. పేరుకు లచ్చిందేవే గాని, తన పరిస్థితి మటుకు పెద్దమ్మవారే తను. తన ఉపమానానికి నవ్వొచ్చి నవ్వుకుంది.

ఎన్ని రోజులో గుర్తులేదు గానీ చాలా రోజుల తర్వాత జాకెట్టుకెన్ని డబ్బులు కావాలనుకుందో అంతా చేరింది. అమ్మగారు చెప్పిన చోటికి వెళ్ళి ఆ గుడ్డని కొని తెచ్చుకుంది. అమ్మగారెక్కడ ఆ జాకెట్టు కుట్టించుకుందో కనుక్కుంది. అమ్మగారి

జాకెట్టులాగే గల్ల క్రాసు వేసి కుట్టమని టైలరు సాయిబుకి చెప్పింది. అది కుట్టించే వరకూ తల్లికి చెప్పకూడదనుకుంది. అటువంటి లేని ఇళ్లల్లో ఈ చిన్ని చిన్ని సరదాలే వాళ్లకు పండగలు. ఈ జాకెట్టు వ్యవహారం కూడా ఆ పిల్లకో 'తీపి కల'. అది నిజం చేసుకుంటున్నాననే ఆనందం. ఆ రోజు జాకెట్టు తెచ్చుకోవలసిన రోజు. స్కూలు నుంచి తిన్నగా టైలరు దగ్గరకెళ్లింది. తను ఎప్పుడూ ఇచ్చే కూలి డబ్బులే వాడి చేతిలో పెట్టింది.

"ఇదేంటే! ఈ జాకెట్టుకు నువ్వు కూలీ ఎక్కువివ్వాలి" అన్నాడు టైలరు.

"ఎందుకూ?"

"ఎందుకేంటే! గల్ల షోకు చెయ్యమన్నావుగా. అందుకు మరో రెండు రూపాయలు ఎక్కువియ్యి."

"బాబూ! మరి రెండు రోజుల్లో నీ డబ్బులు నీకు తెచ్చిస్తాను. ఇప్పుడు డబ్బులు లేవు. నేన్నీకు తెలుసుగా. జాకెట్టు మటుకు ఈ రోజిచ్చెయ్యి" అని చెప్పి బ్రతిమాలుకుంది. అతనేమనుకున్నాడో జాకెట్టు పిల్ల చేతిలో పెట్టి, "సర్లే! మిగతా డబ్బులు తొందరగా తెచ్చిచ్చేయ్" అన్నాడు. అంతే, ఆ రవికను ఓ చంటి బిడ్డను పట్టుకున్నట్టు పొదివి పట్టుకుని ఇంటివైపు త్వరత్వరగా అడుగులు వేసింది. అమ్మకిప్పుడు తను చేసిన ఘనకార్యం చెప్పుకోవాలి. ఇల్లు దగ్గరయ్యేసరికి అమ్మ మరో మనిషితో నవ్వుతూ గట్టిగా మాట్లాడుతోంది. లోపలికెళ్లి 'ఎవరమ్మా' అంది. "అరే! నువ్వెరగవు కదూ. ఈమె నా చెల్లెలే. అంటే, నీకు పిన్ని. ఇన్ని రోజులకు అక్కను చూడాలనుకుందట. మన ఎడ్రసు కనిపెట్టుకుని వచ్చిందే."

తనింటికో చుట్టం రావడం- అదీ ఇన్నాళ్లకు, తనకూ సంతోషంగానే ఉంది. చెల్లెలొచ్చిందని అమ్మ కూడా మంచి వంట చేసింది. అప్పుడు కూతురు చేతిలో వున్న వస్తువు చూసి, "ఏమిటే అది?" అంది. అమ్మ పక్కన పిన్ని వున్న గురించి సంకోచిస్తూ-

"ఇదా... ఇది... జాకెట్టు కుట్టించుకున్నానమ్మా"

"ఆఁ నువ్వే కుట్టించుకున్నావా?" చెల్లెలు పక్కనుండడంతో ఆమె కూడా ఎక్కువ ఆరా తీయలేదు. అక్కాచెల్లెల్లిద్దరూ జాకెట్టు చూసి మురిసిపోయారు.

✦ ✦ ✦

లక్ష్మి పిన్ని మరిది గారి పెళ్లి ఈ వూళ్లోనే జరుగుతుందట. "ఎలాగూ పెళ్లికి అక్క వున్న వూరు వెడుతున్నాను గదా అని ఒకరోజు ముందే

## హైకూలు

ఏకధారగా
ఏడుస్తుంది ఆకాశం
భూమి ఓదార్పు.

❖ ❖ ❖

మబ్బుల్లో దాగి
చంద్రుడు దోబూచులు
పైకెగరాలి.

❖ ❖ ❖

ఆకాశ భామ
అందమైన చీరకు
మెరుపు జరీ.

❖ ❖ ❖

శిరసూపుతూ
తరుల దరహాసం
వర్షాగమనం.

❖ ❖ ❖

కొండల అందం
బండలకే తెలుసు
అంతర్లీనమై.

❖ ❖ ❖

కందిపోయేరు
అందమైన భామలు
చంద్రుడి రాక.

*– గణపతిరాజు నరసింహరాజు*

బయలుదేరి మనింటికి వచ్చింది." "ఆహా!" అంది లక్ష్మి. ఆమె మనసంతా సినిమా మీదనే వుంది. ఈ రవిక తొడుక్కుని తను సినిమాకెళ్లాలీ రోజు. అందుకే కుట్టు కూలీ డబ్బులు చాలకపోయినా బ్రతిమాలి తెచ్చుకుంది. ఈ రోజు అమ్మగారు తనకు తోడుగా సినిమాకు రమ్మన్నారు. అలా వెళ్తే తనకు డబ్బులు ఖర్చు కూడా ఉండదు. అలా ఆలోచించి మెల్లగా, "అమ్మా! నన్నమ్మగారు సినిమాకు రమ్మన్నారే", అంది. "సర్లే వెళ్లు" అందామె చెల్లెలి సరదాలో, ఆ పిల్లను అట్టే పట్టించుకోకుండా.

కవర్లో వున్న జాకెట్టు తీసి తొడిగి చూసుకుంది లక్ష్మి. బావుంది కానీ కాస్త లూజుగా వుంది. ఊం యిలా వెళ్తే అమ్మగారు నవ్వుతారేమో. రేపు డబ్బులిచ్చేటప్పుడు వాణ్ణి కాస్త బిగుతు చెయ్యమని చెప్పాలి అనుకుంది. ఆ జాకెట్టు విప్పి దన్నేన వేసి వెళ్లిపోయింది. మరి తరవాత దాని సంగతే మర్చిపోయింది. రాత్రి అందరూ పడుకున్నాక తను వచ్చి నిద్రపోయింది.

మరునాడు స్కూలుకి వెడుతుంటే తల్లి అడిగింది– "నువ్వా పెళ్లికొస్తావేమిటే" అని. నేను స్కూలుకి వెళ్లాలమ్మా అనేసి బయలుదేరింది.

అక్కాచెల్లెళ్లిద్దరూ పెళ్లికి బయలుదేరారు.

నిన్న ఆ జాకెట్టు చూసిన దగ్గర్నుంచీ దానిమీదే వుంది లక్ష్మి పిన్ని మనసంతా.

"నీ కొత్త జాకెట్టు బాగుందే. పెళ్లికి నేను వేసుకోనా" అంది పిన్ని లక్ష్మితో.

"అమ్మనడిగి తీసుకో" అని అన్యమనస్కంగా స్కూలుకెళ్లిపోయింది.

ఇదే సమయమని "అక్కా! లక్ష్మి నా లావులోనే వుందే" అంది.

"ఎందుకూ?" అందక్క

"ఆం ఏం లేదు. అది ఎలాగూ రానందిగా. ఆ జాకెట్టు బావుంది. పెళ్లిలో వేసుకుందామని" అంది నసుగుతూ.

"దానికేం భాగ్యం. పెళ్లిలో వేసుకో. నీకూ బావుంటుంది" అని తాడునున్న రవిక తీసి చెల్లెలికిచ్చింది.

"తిరిగి రాగానే పులిమి ఇచ్చేస్తానులే అక్కా" అని చెప్పి దాన్ని తన సంచీలో దాచుకుంది.

పెళ్లిలో కట్టుకున్న పాత పట్టుచీర మీద ఈ కొత్త జాకెట్టు కొత్త వాసన గుబాళిస్తుంటే వింతగా అనిపించింది ఆమెకు. వీళ్లు ఎవరో విడిచేసిన గుడ్డలు కడతారు తప్ప కొత్త గుడ్డలు చూడ్డం అరుదు. అటువంటిదీ రోజు కొత్త జాకెట్టు. మరిది పెళ్లి అంతా వింతగా వుందామెకు. అందుకే అవసరం లేకపోయినా అందరి పక్కకూ వెళ్లి నిలుచునేది.

✦ ✦ ✦

లక్ష్మి ఇంటికి వచ్చేసరికి అందరూ పడి నిద్రపోతున్నారు. దన్నెం వంక చూసింది. జాకెట్టు లేదు. బహుశా పిన్ని పెళ్లికి తొడుక్కునుంటుంది అనుకుని, వాళ్లను లేపటం ఇష్టంలేక తనూ వాళ్ల పక్కనింత చోటు చేసుకుని పడుకుంది. పడుకునే ముందు పిన్ని వంక చూసింది. ఆమె ఒంటిమీద తన కొత్త జాకెట్టు లేదు. పిన్ని మంచిదే. జాకెట్టు నలిగిపోతుందని తీసి దాచుంటుంది అనుకుంది. తృప్తిగా నిద్రపోయింది.

✦ ✦ ✦

మరునాడు లేచిన దగ్గర్నుంచీ పిన్ని వాళ్లూరు వెళ్లిపోయే హడావిడిలో వుంది. తన జాకెట్టు గురించి పిన్ని మాట్లాడ్డం లేదు. తనకు అడగాలంటే మొహమాటంగా వుంది. ఏవో జాకెట్లు కలిగిన వాళ్లకది లెక్కకాదు గానీ తనకది బ్రహ్మాండమే. అది మళ్లీ సంపాదించుకోలేదు తను.

ఎలాగో మాటలు కూడబలుక్కుని అడిగేసింది, "పిన్నీ! నా జాకెట్టు ఇచ్చావా?" అని.

"అయ్యో! నిన్ననే విప్పి మీ తాడు మీదే వేశానమ్మా. నీ జాకెట్టు నేనేమీ తీసుకుపోవటం లేదు" అనేసి ఆమె వచ్చిన దారినే వెళ్లిపోయింది. లక్ష్మి ఆ జాకెట్టు కోసం ఒక్క దన్నెం మీదే కాదు, ఇల్లంతా వెతికింది. వెతికి వెతికి అలసిపోయింది.

ఆ గళ్ల రవిక మటుకు మళ్లీ లక్ష్మి కంటికి కనిపించలేదు. తను ఇన్ని కలలు కన్న ఈ జాకెట్టు పిన్ని ఎలా మాయం చేసేసింది. తను టైలరు కివ్వవలసిన డబ్బులు కూడా పూర్తిగా ఇవ్వలేదే. లక్ష్మి ప్రాణం ఉసూరుమంది.

●